క్లుప్తంగా

రాముడి జీవితం మానవాళికి ఆదర్శం

నిజామాబాద్అర్బన్: రాముడి జీవితం మానవాళికి ఆదర్శం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలో శ్రీ రామ కృష్ణ విద్యానికేతన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు మన సంస్కృతి సంప్రదాయలను నేర్పించాలన్నారు. విద్యతోపాటు రామాయణం, మహా భారతం వంటి సారాంశాలను పిల్లలకు బోధించాలన్నారు. అనంతరం రాముడు, హనుమంతు, సీత వేషధారణలో ఉన్న చిన్నారులతో ఎమ్మెల్యే ఫొటోలు దిగారు. ప్రిన్సిపాల్ శశిరేఖ, టీచర్లు శ్రీనివాస్, మధుసుదన్ పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి



సిరికొండ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ప్రగతి శీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో ఆదివారం పీవైఎల్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఉద్యోగాల నియామకాలలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను అరికట్టాలన్నారు. నాయకులు ప్రేమ్‌సింగ్, బాలకిషన్, వినోద్, రాజశేఖర్, సురేష్, సాగర్, హరికృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవోద్యమంలో మరో మైలురాయి



సిరికొండ: దేశంలో వివిధ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న మూడు విప్లవ పార్టీల విలీనం భారత విప్లవోద్యమంలో మరో మైలురాయి లాంటిదని ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు పిట్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు విప్లవ పార్టీల విలీనంతో ప్రజాపంథా పార్టీ ఇక నుంచి సీపీఐఎంఎల్ మాస్‌లైన్‌గా ఆవిర్భావం చెందిందన్నారు. మార్చిలో ఖమ్మంలో పార్టీల విలీనాన్ని పురస్కరించుకొని భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు రమేష్, బాబన్న, దామోదర్, నారాగౌడ్, లింబాద్రి, సాయారెడ్డి, అనీస్, బాల్‌రెడ్డి, సాయిలు, కిషోర్ పాల్గొన్నారు.

నేడు సిరికొండ మండలంలో ఎమ్మెల్యే పర్యటన

సిరికొండ: మండలంలోని రావుట్ల, న్యావనంది, మైలారం గ్రామాల్లో సోమవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పర్యటించనున్నట్లు డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ నరేష్, పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి ఒక ప్రకటనలో తెలిపారు. రావుట్ల గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం, న్యావనంది గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని వారు తెలిపారు. మైలారంలో పార్టీ నాయకులతో సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

దంత వైద్యశిబిరం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగర శివారులోని బోర్గాం(పి)లో ఆదివారం వజ్ర దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు సంతోష్ కుమార్ పలువురికి దంతవైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యశిబిరంలో చికిత్స పొందిన వారికి 50శాతం రాయితీపై దంత మార్పిడి చేస్తామన్నారు. అవసరమైన వారికి టూత్‌పేస్టులు, మందులు ఉచితంగా అందజేశారు. గ్రామస్తులు, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేఖర్, నాగభూషణం, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ విగ్రహాలతో ఆలయ పరిసరాల్లో పల్లకీసేవ నిర్వహిస్తామన్నారు. రామాలయంలో పెద్ద ఎత్తున దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముస్తాబైన ఆలయాలు

- నేడు అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠాపన
- జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయాల కమిటీలు



డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలోని కల్యాణ వేదికను శుభ్రం చేస్తున్న భక్తులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్)/నిజామాబాద్ సిటీ: అయోధ్యలో మరికొద్ది గంటల్లో జరిగే రామాలయ ప్రారంభోత్సవం, బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అపురూప ఘడియల కోసం దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో జిల్లాలోని అన్ని రామాలయాల్లో రాముడి పూజకు, పలు కార్యక్రమాలు నిర్వహించడానికి ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇప్పటికే హిందూ సంఘాల సభ్యులు, బీజేపీ నాయకులు ఆలయాలను శుద్ధి చేసి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుద్దీపాలతో అలంకరించి పండుగలా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు చేయనున్నారు.

ఖిల్లా రామాలయాల్లో..

జిల్లాలోనే చారిత్రక ప్రసిద్ధి చెందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని హిందువులు, రామభక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని, ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే నగరంలోని ఖిల్లా రామాలయంలో ఉదయం ఏడు గంటలకు సీతారాములకు అభిషేకం, యజ్ఞం, అర్చన, సీతారామ కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12.20 నిమిషాలకు రామాజ్యోతి వెలిగించనున్నారు. అనంతరం ఆలయంలో హనుమాన్ చాలీసా, రామా పారాయణం, భజన కార్యక్రమం, పల్లకీసేవ, అన్నప్రసాద వితరణ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరుగనున్నాయి. పెద్ద రామ మందిరంలో ఉదయం 7 గం నుంచి 8 వరకు పవమాన సూక్తం, 8.30 నుంచి 9.30 గం. వరకు పుష్పార్చన, 9.40 గం.లకు హారతి, 10గం.లకు పులిహోర ప్రసాద వితరణ, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6 గం వరకు సుందరకాండ పఠనం, భజన, రాత్రి 7గం. లకు ఉపహారము, 7.10 గం.లకు రామరక్షా స్తోత్ర పఠనం, 8గం. లకు హారతి తీర్థ ప్రసాదాల వితరణ నిర్వహించనున్నట్లు బడారాం మఠ్ ఉత్తరాధికారి ఇన్‌చార్జి మఠాధిపతి శ్రీరామచంద్రస్వామి తెలిపారు. సుభాష్‌నగర్‌లోని ఆలయంలో ఉదయం 7గం.లకు రామార్చన పారాయణం, ఉ.11గం.లనుంచి మ.1గం. వరకు అయోధ్య నుంచి ప్రసారం అయ్యే కార్యక్రమాలు ప్రత్యక్ష ప్రసారం ఎల్ఈడీ ద్వారా వీక్షణ. డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాముడి నృత్య రూపం కార్యక్రమం. అనంతరం అన్నదాన వితరణ. మహాహారతి. సహస్ర అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సరళ మహేందర్‌రెడ్డి తెలిపారు. అలాగే నగరంలోని శంభునిగుడి ఆలయంలో సాయంత్రం దీపోత్సవం నిర్వహించనున్నారు. అలాగే అన్ని మండలాలు, గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గూపన్‌పల్లిలోని మహాగణపతి ఆలయ ప్రాంగణంలో నీలకంఠేశ్వర ప్రభాత్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటింటా పండుగ వాతావరణం..

సుమారు నెల రోజులుగా అన్ని గ్రామాల్లో అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజిత అక్షింతలు ఇంటింటికీ చేరాయి. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు బాలరాముడి ప్రాణప్రతిష్ఠను హిందూ భక్తులు తమ ఇళ్లల్లో పండుగలా జరుపుకోనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే తమ ఇళ్ల గోడలపై జై శ్రీరామ్ అంటూ రాసుకోవడంతో పాటు చాలా మంది ఇళ్లపై శ్రీరాముని చిత్రాలతో ముద్రించిన జెండాలను కట్టారు. సాయంత్రం ఇళ్లల్లో దీపాలు వెలిగించనున్నారు. ఊళ్లల్లో ప్రధాన కూడళ్లు, ఆలయల వద్ద కాషాయ జెండాల తోరణాలను కట్టారు. కొన్ని గ్రామాల్లో తమ పిల్లలను పాఠశాలలకు పంపించవద్దని పండుగ వాతావరణంలో అందరూ పాల్గొని అన్నదాన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానాలు చేసుకున్నారు. అలాగే అయోధ్యలో జరిగే ఆ అపురూప దృశ్యాన్ని తిలకించడానికి పలు గ్రామాల్లో టీవీలు, భారీ తెరలు ఏర్పాటు చేసుకుంటున్నారు.



గూపన్‌పల్లిలోని గణపతి ఆలయ ఆవరణను శుభ్రం చేస్తున్న స్వయం సేవకులు



ఖిల్లా రామాలయంలో ఏర్పాట్లు





ఖిల్లా రామాలయం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం.. సిద్ధమవుతున్న స్వామివారి కల్యాణ వేదిక

'జై శ్రీరాం' జెండాల పంపిణీ



సుభాష్‌నగర్:నగరంలోని వినాయక్‌నగర్‌లో ఆదివారం మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటికీ 'జై శ్రీరాం' జెండాలను పంపిణీ చేశారు.అనంతరం ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ మాట్లాడుతూ.. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై రాముడి జెండాలను పెట్టుకోవాలనే ఉద్దేశంతో పంపిణీ చేశామని తెలిపారు. ట్రస్ట్ ప్రతినిధులు, కాలనీవాసులు ఆ గమయ్య, రాజేందర్, ప్రసాద్, దేవేందర్, రమేష్, శ్రీనివాస్, రాజు, నారాయణ, రవి, భాను పాల్గొన్నారు.

లెనిన్ పోరాటం స్ఫూర్తిదాయకం



నగరంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సీపీఐ నాయకులు



సిరికొండలో..



నగరంలో మాట్లాడుతున్న నాయకులు

సిరికొండ/ఖలీల్‌వాడి: రష్యాలో కార్మికవర్గం రాజ్యాధికారం, విప్లవం విజయవంతం కావడానికి లెనిన్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. నగరంలో ఆదివారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ, సీపీఐ ఆధ్వర్యంలో లెనిన్ వర్ధంతిని వేర్వేరుగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన పోరాటాలను కొనియాడారు. అలాగే సిరికొండలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో, పెద్దవాల్గోట్ గ్రామంలో చంద్రన్న వర్గం ఆధ్వర్యంలో లెనిన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య, నీలం సాయిబాబా, పరుచూరి శ్రీధర్, దేశెట్టి సాయిరెడ్డి, శివకుమార్,మురళి, సత్యం, రమేష్, జన్నారపు రాజేశ్వర్, రాజు, కృష్ణ, పోశెట్టి, భాస్కర్, సుధాకర్, రఘురాం, సాయమ్మ, అంజలి, గంగాధర్, బాలయ్య, మార్క్స్, భూమేష్, సంజీవ్, గులాం హుస్సేన్, కృష్ణ, నరేష్‌గౌడ్, నర్సాగౌడ్, శివరాజ్, సాయికుమార్, భాస్కర్, గంగారెడ్డి, వరదయ్య, సతీష్, రాజేందర్, ప్రేమ్‌సింగ్, పృథ్వీ, ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక ..

మోటాటిరెడ్డి సంఘం ఇందూరు..



సుభాష్‌నగర్: నగరంలోని మోటాటిరెడ్డి సంఘం కార్యాలయంలో ఆదివారం మోటాటి రెడ్డి సంఘం ఇందూరు నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గోవింద్‌గారి గంగారెడ్డి, ప్రధానకార్యదర్శిగా ద్యావర నర్సారెడ్డి, కోశాధికారిగా లక్కం మనోజ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పోతునూరి మహిపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా అమరం శ్రీనివాస్‌రెడ్డి, యెన్నం లచ్చారెడ్డి, ముఖ్య సలహాదారులుగా జి భూంరెడ్డి, టి రాంరెడ్డి, కార్యవర్గసభ్యులుగా మన్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సాయిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దేవేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ.. సభ్యులందరం సమష్టిగా ఉండి సంఘానికి స్థలం, భవన నిర్మాణానికి పాటుపడదామని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

ఆర్టీసీ కాలనీ కమిటీ..



నిజామాబాద్ రూరల్: మండలంలోని ఆర్టీసీ కాలనీ అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కాలనీకి చెందిన డి.బాపురావు, సురేశ్‌రాజేందర్ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. మొత్తం 226 ఓట్లకుగాను 117 ఓట్లు పోలయ్యాయి. డి.బాపురావు 49 ఓట్లు సాధించగా, సురేశ్ రాజేందర్ 129 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా విజయం సాధించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా రోహిత్, కోశాధికారిగా విఠల్ సుమన్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు గోవింద్‌రెడ్డి, బాపురావు, అశోక్ ఎన్నికైన సభ్యులకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. రాజేశ్వర్‌రావు, శ్యామ గంగాధర్, రమేశ్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి



పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జాన్కంపేట్‌లో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ విజయ, ఎంపీటీసీ సంజీవ్, మాజీ సర్పంచ్ బండారు దశరథ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జాన్కంపేట్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గంగా కిశోర్, పార్టీ మైనార్టీ విభాగం గ్రామ అధ్యక్షుడు తాహెర్, యువకులు పెరిక రవి, చిలుక ప్రవీణ్, వీరవత్తిని రాజు, ఉప్పు రఘువరన్, పిట్ల రాము, దినేశ్, ఆర్గనైజర్లు రుక్మాయి హరీశ్, చిక్కల సృజన్ తదితరులు పాల్గొన్నారు.

మత రాజకీయాలను తిప్పికొట్టాలి

ఖలీల్‌వాడి: కేంద్ర ప్రభుత్వ మత రాజకీయాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ అన్నారు. నగరంలోని నాందేవ్‌వాడలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం అయోధ్య రామ మందిరాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు. కేంద్రం తీరుపై నిరసనగా ఈనెల 26న వాహనాలతో ర్యాలీ, ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. నాయకులు రమేష్ బాబు, నూర్జహాన్, ఈవీఎల్ నారాయణ, రేణుక, సుకన్య కృష్ణ, కటారి రాములు, నర్సయ్య, లక్ష్మీ, మౌనిక, కొండ గంగాధర్, చామంతి, లక్ష్మి, మోహన్, సాగర్ రాజేష్, పసియోద్దీన్, సాయిలు పాల్గొన్నారు.

అవినీతిని సహించేది లేదు



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: తాను ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం అవినీతి, అక్రమాలను ప్రోత్సహించకుండా నిజాయితీతో ప్రజల అభివృద్ధికి పాటుపడుతానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాంచంద్రాపల్లి గ్రామపంచాయతీ భవనాన్ని ఆదివారం రాకేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతానన్నారు. తనవల్ల పొరపాటున ఏదైన తప్పు జరిగితే తన దృష్టికి తీసుకురావాలని, సరిదిద్దుకుంటానే తప్ప ఎవ్వరిపై ద్వేషం పెంచుకోనని అన్నారు. ప్రజలు నిర్భయంగా తన వద్దకు రావొచ్చన్నారు. తనతో అయ్యే పనిని దగ్గరుండి చేసి పెడతానన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేద్దామని, అన్ని వర్గాల వారు కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో జె క్రాంతి, సర్పంచ్ కట్కం వెంకన్న, ఎంపీటీసీ పెద్దులు, బీజేపీ నాయకులు తాడు మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లిలో ఊర పండుగ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఘనంగా ఊర పండుగ



ఊర పండుగలో పోతరాజు విన్యాసం

ముప్కాల్ మండలం వేంపల్లిలో ఆదివారం ఊరపండుగను ఘనంగా నిర్వహించారు. ఆరే పోశవ్వ ప్రతిమలను ఊరేగించారు. పాడి పశువులు, వ్యవసాయం బాగుండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. –బాల్కొండ

పోచారంలో వాలీబాల్ టోర్నీ

ఎడపల్లి(బోధన్): సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఎడపల్లి మండలంలోని పోచారంలో సర్పంచ్ కోల ఇంద్రకరణ్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీని ఆదివారం ప్రారంభించారు. కోల సుశీల, ప్రభుదాస్ జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.2222తో పాటు షీల్డ్, అలాగే రెండో బహుమతిగా రూ. 1,111 నగదుతోపాటు షీల్డ్‌ను అందించనున్నారు.

'డబుల్' ఇళ్లను పంపిణీ చేయాలి

రెంజల్(బోధన్): గరీబోళ్ల సొంతింటి కలను నిజం చేసేందుకు గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అధికారులు వెంటనే ప్రారంభించాలని కళ్యాపూర్ సర్పంచ్ కాశం నిరంజని సాయిలు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల కిందట గ్రామంలో 30 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, అధికారులు అప్పట్లోనే అర్హులను ఎంపిక చేశారని గుర్తుచేశారు. వారం రోజుల కిందట అధికారులు గుర్తించిన లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందిస్తే వాటిని శుభ్రం చేసుకున్నారని పేర్కొన్నారు. అధికారులు వెళ్లి వారిని కబ్జా చేశారని బలవంతంగా ఖాళీ చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు జాప్యం చేస్తే నిరుపయోగంగా మారుతాయని వారు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రుద్రూర్: ఉమ్మడి కోటగిరి మండలంలోని పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ ఆర్డీవో భుజంగ్ రావు, తహసీల్దార్లు ప్రభాకర్, రమేశ్ ఆదివారం సందర్శించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు ఎలా చేస్తున్నారని బీఎల్‌వోలను ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటరు జాబితాలో వారి పేర్లను నమోదు చేయించాలని సూచించారు. నిర్ధారణ చేసుకున్న తరువాత మృతి చెందిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. వారివెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మహ్మద్ సయ్యద్ హుస్సేన్, సాయిలు ఉన్నారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	32	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	80	పచ్చిమిర్చి	40	70
జీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	45	60	ఆలుగడ్డ	15	30
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	60	80	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్‌రూట్	25	50
పాలకూర	10	20	కరివేపాకు	60	80
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	30	50
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు


చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,100	వెండి (కిలో)	75,500
22 క్యారెట్స్	59,108		

– నిజామాబాద్ బిజినెస్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	నా సామిరంగ -1.35, 4.35, 10.45 గుంటూరుకారం - 7.40
స్క్రీన్-2	గుంటూరుకారం (తెలుగు) - 10.25, 4.20, 10.30 సైంధవ్ (తెలుగు) - 1.30, 7.30
స్క్రీన్-3	హనుమాన్(తెలుగు) - 10.30, 1.30, 4.30, 7.35, 10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	హనుమాన్-9.40, 1.00, 4.20, 7.40, 11.00
స్క్రీన్-2	హనుమాన్(హిందీ)-12.00, 6.40, 10.00, గుంటూరుకారం - 3.20
స్క్రీన్-3	గుంటూరుకారం-11.40, 6.20, 9.40 హనుమాన్(హిందీ)-3.00
స్క్రీన్-4	నా సామిరంగ (తెలుగు)-12.40, 6.50, 10.00, సైంధవ్ - 3.50
దేవి	హనుమాన్(తెలుగు)
నటరాజ్	నా సామిరంగ(తెలుగు)
లలితామహల్	గుంటూరు కారం(తెలుగు)
విజయ్	సైంధవ్(తెలుగు)